ప్రజాశక్తి
గురువారం 15 జూన్ 2023
5
అల్లూరి సీతారామరాజు



బోడిగుడలో వైద్యశిబిరం నిర్వహించాలి

ప్రజాశక్తి- డుంబ్రిగుడ : దోమలగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బోడిగుడ కేంద్రంగా ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యశిబిరం నిర్వహించాలని బోడిగుడ పరిసర గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. బోడిగుడలో కాకుండా పోతంగిలో వైద్యశిబిరం నిర్వహించి చేతులు దులుపుకోవడం వల్ల బోడిగుడ చుట్టుపక్కల ఉన్న బైలుగుడ, బయలువలస, బోడిగుడ కాలనీతో పాటు మరో రెండు గ్రామాల గిరిజనులకు వైద్యసేవలు అందని పరిస్థితి ఉందని అంటున్నారు. పోతంగికి రెండుకిలోమీటర్ల దూరంలో ఉన్న బోడిగుడలో వైద్యశిబిరం నిర్వహిస్తే పరిసర ప్రాంత గిరిజనులకు ప్రయోజనకరంగా ఉంటుందని, దీనిపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వం వైద్యసేవలు, ముఖ్యంగా ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలను గ్రామాల్లో నిర్వహించడంతోపాటు ఇంటింటా వైద్యఅవసరాలపై పరిశీలన చేయాలని ప్రభుత్వం నిర్దేశిస్తే, దానికి భిన్నంగా కొన్ని గ్రామాలకే పరిమితం చేస్తే ఎలాగని బోడిగుడ గిరిజనులు ప్రశ్నిస్తున్నారు.

నాడు - నేడు పనుల పురోగతిపై అసంతృప్తి



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలోని సీతగుంట కస్తూర్బా పాఠశాలలో నాడునేడు పనుల పురోగతిపై అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం సీతగుంట సందర్శించి, కస్తూర్బా పాఠశాలలతోపాటు జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఇంగ్లీష్ మీడియం పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా కస్తూర్బా పాఠశాలలో నాడునేడు పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదని స్పెషలాఫీసర్ కుమారిని ప్రశ్నించారు. స్పెషలాఫీసర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మధ్య పరస్పర సహకారం లేకపోవడం వల్లే పనుల్లో జాప్యం జరుగుతుందని గుర్తించి, తక్షణమే తగు చర్యలు చేపట్టకుంటే ఎస్ఒపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో నాడునేడు పనులను రెండురోజుల్లో ప్రారంభించాలని హెచ్ఎంను ఆదేశించారు. ఆశ్రమ బాలుర పాఠశాలలో సెంటరింగ్ పనులు వారంరోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. నాడునేడు పనుల పురోగతి ఆశాజనకంగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేసిన అసిస్టెంట్ కలెక్టర్, హెచ్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేయాలని ఎంఈఓ పూర్ణయ్యను ఆదేశించారు.

గిరిజన రైతులకు రాయితీపై పవర్ టిల్లర్లు



పవర్ టిల్లర్లను పంపిణీ చేస్తున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పివిటిజి రైతులు పవర్ టిల్లర్లను సద్వినియోగం చేసుకుని వ్యవసాభివద్ధి సాధించాలని ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ నన్నారు. బుధవారం ఐటిడిఎ కార్యాలయం వద్ద సిసిడిపి నిధులు రూ.1కోటి 19 లక్షల 64 వేల 600 విలువైన 102 పవర్ టిల్లర్లను రైతులకు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా గిరిజన రైతులతో మాట్లాడుతూ రూ.లక్ష రాయితీపై పివిటిజి రైతులకు అందిస్తున్నామన్నారు. రైతులు రూ.17,300 తిరిగి చెల్లించాలని సూచించారు. పెదబయలు మండలంలో 17 మంది రైతులకు, పాడేరులో 45 మంది, హుకుంపేటలో ఆరుగురు, అరకువ్యాలీలో 18మంది , అనంతగిరి మండలానికి చెందిన 16 మంది రైతులకు ముందుగా పంపిణీ చేస్తున్నామన్నారు. వ్యవసాయ పనులకు పవర్ టిల్లర్లు వినియోగించుకోవాలని, దీనిద్వారా రైతులకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. పవర్‌టిల్లర్లను ఇతరులకు విక్రయించకూడదని సూచించారు రైతు భరోసా అందింది లేనిది అడిగి తెలుసుకున్నారు. అందరికీ ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు వచ్చాయా అని ఆరా తీశారు.కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాత్సవ, ఐటిడిఎ ఎపిఒలు విఎస్ ప్రభాకరరావు, ఎం.వేంకటేశ్వరరావు, ప్రాజెక్టు ఉద్యాన్ణవన అధికారి ఎన్.అశోక్, హెచ్ఒ అప్పనాయుడు, రైతులు పాల్గొన్నారు.

మన్యంలో మండిపోతున్న ఎండలు

దేవిపట్నంలో అత్యధికంగా 43.7 డిగ్రీల సెల్సియస్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లాలో ఎండలు మండి పోతున్నాయి. గత కొన్ని రోజులుగా ఎక్కడా తగ్గడం లేదు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ ఎండలు దంచి కొడుతున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ తీవ్రతకు ప్రజలు బెంబెలెత్తిపోతున్నారు.వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ, తలపోటు, నీరసం, విరోచనాలు వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. జూన్‌లో ఈ స్థాయి ఎండల తీవ్రత ఎన్నడూ చూడలేదని ప్రజలు వాపోతున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా ఉష్ణం పుట్టి, జనాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో 36 నుంచి 43 డిగ్రీల సెంటీగ్రేడ్‌పైనే అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం భయాందోళన కలిగిస్తుంది. బుధవారం మండలాల వారీగా నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే, దేవిపట్నంలో అత్యధికంగా 43.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, గంగవరంలో 43.4, చింతూరులో 43.2, కూనవరంలో 43.0, కొయ్యూరులో 41.8, మారేడుమిల్లిలో 41.2, అడ్డతీగలలో 41.7, వై.రామవరంలో 41.1, రంపచోడవరంలో 40.9, రాజవొమ్మంగిలో 40.4, అనంతగిరిలో 35.9, అరకులోయలో 36.2 చింతపల్లిలో 37.0, డుంబ్రిగుడలో 36.0, జికెవీధిలో 37.5, జి.మాడుగులలో 38.6, హుకుంపేటలో 35.1, ముంచంగిపుట్టులో 37.2, పాడేరులో 35.3, పెదబయలులో 36.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణశాఖ ప్రకటించింది

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన




రక్తదానం చేస్తున్న విద్యార్థులు, సిఆర్‌పిఎఫ్ జవాన్లు

ప్రజాశక్తి -పాడేరు: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రక్త చైతన్యకర్త రాష్ట్రసేవా పురస్కార్ అవార్డు గ్రహీత గణేష్ కొమ్మోజు సహకారంతో, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు సౌజన్యంతో నిర్వహించిన ఈ మెగా వైద్యశిబిరాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ సబ్ కలెక్టర్ అభిషేక్, ట్రైనీ కలెక్టర్ అశితోష్ శ్రీవాస్తవ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆరోగ్యవంతులైన యువకులు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చున్నారు.ఒకరు చేసే రక్తదానంతో కనీసం ముగ్గురు ప్రాణాలను కాపాడవచ్చున్నారు. విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవాభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సిఆర్‌పిఎఫ్ జవాన్‌లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన రక్తదానం చేయడాన్ని అభినందించారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు పలువురు ఉత్సాహంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ జమాల్ భాషా, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జి రూపకళ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టబ్బాయి, రెడ్‌క్రాస్ సిబ్బంది టెక్నీషియన్ రాజాబాబు, సభ్యులు జయలక్ష్మి, సూర్యారావు, లోహితస్, సుబ్రహ్మణ్యం, సింజీవ్, గౌరీశంకర్, సిబ్బంది సత్య నారాయణ, బి. మణికుమారి, కె. ప్రసాద్, డిగ్రీ కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు రక్తదాతలు పాల్గొన్నారు.

వామ్మో చికెన్..!

- ◆ కొండెక్కి కూర్చున్న కోడిమాంసం ధర
- ◆ స్కిన్‌తో కిలో రూ.320, స్కిన్ లెస్ రూ.330
- ◆ పెరిగిన ధరలతో మందగించిన అమ్మకాలు
- ◆ మాంసం దుకాణాల వైపు చూడని మామూలు జనం



పాడేరులో చికెన్ షాప్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: చికెన్ ముక్క లేనిదే ముద్ద దిగని వారు ఎందరో ఉన్నారు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకూ చికెన్ ప్రియులు చాలామంది ఉంటారు. అలాంటి చికెన్ కొనాలంటే వామ్మో అంటున్నారంటే, ధర ఏ స్థాయిలో పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. మండలకేంద్రాలలో పోటీపడుతూ, చికెన్ ధరలు అమాంతం మండిపోతూ, కొండెక్కి కూర్చున్నాయి. కొన్ని రోజుల నుంచి పైపైకి ఎగబాకడమే తప్ప, వెనక్కు తగ్గే పరిస్థితి కనిపించడం లేదు.

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో బుధవారం కిలో చికెన్ స్కిన్‌తో రూ.320, స్కిన్‌లెస్ రూ.330 పలికింది. ఎండ వేడికి కోళ్ళ చనిపోవడంతో, డిమాండ్‌కు తగ్గ సరఫరా లేక చికెన్ ధరలకు రెక్కలు వచ్చాయని వ్యాపారులు అంటున్నారు. గత నెల రోజులుగా చికెన్ ధర రాకెట్ వేగంతో దూసుకెళుతూ, ఎన్నడూ లేని విధంగా, రికార్డు స్థాయి ధర పలకడంతోపాటు రోజుల తరబడి స్థిరంగా కొనసాగుతోంది. మూడు నెల క్రితం ధరలతో పోల్చుకుంటే, కిలో చికెన్ ధర దాదాపు రెట్టింపు అయ్యిందంటే అతిశయోక్తి కాదు. రోజురోజుకూ రూ.10, రూ.20 చొప్పున పెరుగుతూ, ఇపుడు ఏకంగా రూ.350కి అటూఇటుగా ఊగిసలాడుతోంది. బుధవారం ధరతో పోలిస్తే, కిలో చికెన్ రూ.320 పలకడంతో, చికెన్‌ప్రియులు కొనేందుకు మొహం చాటేస్తున్నారు. దీంతో అమ్మకాలు గణనీయంగా మందగించాయని చెప్పాలి. పాడేరు మార్కెట్లో మామూలు రోజుల్లో ఒక్కో చికెన్ దుకాణంలో రోజుకు సగటున 100 నుండి 150 కిలోలు అమ్మకాలు జరిగేవి. ధర అమాంతం పెరగడంతో ఇపుడు 50 కిలోలు అమ్మడమే కష్టమౌతోందనివ్యాపారులు చెబుతున్నారు పేదరు ధరకంటే కిలోపై రూ.20 వరకు తగ్గించి అమ్ముతున్నా కొనుగోలుదారులు ముందుకు రావడం లేదని వాపోతున్నారుమరికొన్ని రోజులు ఇవే ధరలు కొనసాగే అవకాశం ఉందని హోల్ సేల్ వ్యాపారి ఒకరు ప్రజాశక్తికి తెలిపారు.

వ్యాపారం లేక నష్టపోతున్నాం..



ఎండల వేడికి కోళ్ల ఉత్పత్తి తగ్గింది. దీంతో చికెన్ ధరలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. మార్కెట్‌లో లైవ్ కోడి రూ.270 పైనే పలుకుతోంది. ధరలు పెరగడంతో చికెన్ కొనేందుకు జనం రావడం లేదు. కిలోపై రూ.20 తగ్గించినా కొనే పరిస్థితి లేదు. వ్యాపారాలు సాగక నష్టపోతున్నాం. చికెను ధరలు తగ్గాలని కోరుకుంటున్నాం.

అమీన్, చికెన్ వ్యాపారి

ఎండల తీవ్రత, వడగాలులే కారణం



ఎండ తీవ్రత, వడగాల్పుల కారణంగా ఫారాల్లో కోళ్లు బతికే పరిస్థితులు లేవు. కోళ్ల పెంపకం కష్టంగా మారింది. ఫలితంగా పౌల్ట్రీ యాజమాన్యాలు కోళ్ల పెంపకాన్ని గణనీయంగా తగ్గించాయి. మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి లేకపోవడంతో ధరలు పెరుగుతున్నాయి. మరికొన్ని వారాలు ఈ పరిస్థితి తప్పకపోవచ్చు

నాయుడు, చికెన్ వ్యాపారి

చికెన్ కొనలేకపోతున్నాం..



చికెన్ ధరలకు రెక్కలు వచ్చాయి. మార్కెట్‌లో రేట్లను చూస్తే సామాన్య ప్రజలు చికెన్ కొనే పరిస్థితి లేదు. చికెన్‌కు బదులు పప్పన్నంతో సర్దుకుపోతున్నాం. రోజు కూలీ పనికి వెళితే రూ.300 ఇస్తున్నారు. కూలీ పని చేసిన డబ్బు చికెన్ కు సరిపోతే మిగిలిన సరుకులు ఎలా కొనేది.

రాజు, పాడేరు

పాఠశాల బాట పట్టని విద్యార్థులు!

వేసవి సెలవులు ముగిసినా ఇంకా ఇళ్లల్లోనే... రప్పించడంలో అధికారుల నిర్లక్ష్యం, ఉదాసీనత బోసిపోయి ఉన్న విద్యాలయాలు, హాస్టళ్లు

ప్రజాశక్తి- పెదబయలు : విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు రోజులు గడచినా ఇంకా పలు పాఠశాలలు, కాలేజీలు, వసతి గృహాలు బోసిపోయే కనిపిస్తున్నాయి. కనీస మాత్రంగానైనా ఆయా విద్యాలయాలకు ఇంకా విద్యార్థులు చేరుకోని పరిస్థితి ఉంది. వేసవి సెలవులకు ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు పాఠశాలల ముఖం చూసేందుకు ఇంకా ఆసక్తి చూపడం లేదు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలకు వచ్చిన విద్యార్థులే ఇందుకు నిదర్శనం. గురుకులాలు, కళాశాలలు, కస్తూర్బా పాఠశాలలు, ఆశ్రమ వసతి గృహాలు, బాలికల వసతి గృహాలతోపాటు ఆంగ్లమాధ్యమం పాఠశాలలున్నా, ఏఒక్కదానిలోనూ పట్టుమని పదిమంది విద్యార్థులైనా లేరు. వేసవి సెలవులు తర్వాత విద్యాసంవత్సరం ప్రారంభానికి ఆయా విద్యాలయాలు, హాస్టళ్లకు విద్యార్థులను రప్పించడంలో అధికారుల వైఫల్యమే కారణమనే ఆరోపణలూ ఉన్నాయి. దీనిపై సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే, ఎండలు మండుతున్నాయని, అందుకే విద్యార్థులు రావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉందని వారుచెప్పడం వెనుక నిర్లక్ష్యం, నిర్లిప్తత కనిపిస్తోందని చెప్పక తప్పదు. సంబంధిత అధికారులు స్పందించి, విద్యార్థులు వసతి గృహాలకు వచ్చే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

చే గువేరాకు ఘన నివాళి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ప్రపంచ మానవాళి విముక్తి కోసం భౌగోళిక సరిహద్దులతో సంబంధం లేకుండా అమెరికన్ సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా ఆఖరి క్షణం వరకూ పోరాడిన ధీరుడు, కోట్లాది మంది యువత గుండెల్లో నిలిచిన గెరిల్లా యోధుడు చే గువేరా అని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, డివైఎఫ్ఐ మండల నాయకులు టి శ్రీను, పి శేషగిరి అన్నారు, బుధవారం చేగువేరా 95వ జయంతి వేడుకలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాజవొమ్మంగిలో ఘనంగా నిర్వహించారు. ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డివైఎఫ్ఐ నాయకులు చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు బీజేపీ మతోన్మాద శక్తులను అంతం చేయడానికి చే గువేరాను ఆదర్శం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు పాండవుల సత్యనారాయణ, ప్రజా సంఘాల నాయకులు జర్తా రాజు తదితరులు పాల్గొన్నారు.



చే గువేరా చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

పాడేరు : చే గువేరా నేటితరానికి ఉద్యమస్ఫూర్తి, పోరాటదీప్తి అని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ, ఎఐఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు అన్నారు. బుధవారం పాడేరులో చే గువేరా 95వ జయంతి పురస్కరించుకొని ఎపి గిరిజన సమాఖ్య, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాటిన్ అమెరికాలో బైక్‌పై తిరుగుతూ, అక్కడి సమస్యలను అధ్యయనం చేసి, మహత్తర ఉద్యమాన్ని చే గువేరా నిర్మించారన్నారు. చే గువేరా పేరు వినిపిస్తే నరనరాల్లో చైతన్యం ప్రవహిస్తుందని, . దేహం నిలువల్లా నిప్పురవ్వ లా వెలిగి పోతుందన్నారు. నేటి యువతకు ఆదర్శంగా నిలిచిన డైనమిక్ లీడర్ చేగువేరా అని ప్రశంసించారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య నాయకులు చంటిబాబు, మహేష్ సురేష పాల్గొన్నారు.

ఎండ తీవ్రత తగ్గే వరకూ వేసవి సెలవులు పొడిగించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

ఎండ తీవ్రత తగ్గే వరకు విద్యార్థులకు వేసవి సెలవులు పొడిగించాలని జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని రేఖపల్లిలో బుధవారం టిడిపి నాయకులు బురక కన్నారావు ఆధ్వర్యాన జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ మన్య ప్రాంతంలో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటం వలన బడికి వెళ్లే పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వారికి వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నందున, ఎండ తీవ్రతను పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పాఠశాలలకు ఎండ తీవ్రత తగ్గేవరకు వేసవి సెలవు పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామారావు, పెందుర్తి సుదర్శన్‌రావు, కారం సురేష్ బాబు, నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్య ప్రకాష్‌రావు, మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి కారం సిరమయ్య, యూనిట్ ఇన్‌ఛార్జి ముత్యాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు

సప్లిమెంటరీలో ద్వితీయ ఇంటర్ విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి -సీలేరు

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 18 మంది పరీక్షలు రాయగా 18 మంది పాసై ఉమ్మడి విశాఖ జిల్లాలో శత శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపల్ సాయిరాం తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రథమ ఇంటర్ విద్యార్థులు 35 మంది పరీక్షలు రాయగా, 11 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ లెక్చరర్ శ్రీనివాస్, తెలుగు లెక్చరర్ శ్రీరామ్, ఎకనామిక్స్ లెక్చరర్ తలుపులయ్య తదితరులు పాల్గొన్నారు.

వేటగాళ్ల చేతిలో చుక్కల జింక హతం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని గింజర్తి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో బుధవారం వేటగాళ్ల చేతిలో ఒక చుక్కల జింక హతమైంది. అటవీశాఖ ఎఫ్‌బిఓ నరేష్‌బాబు కథనం ప్రకారం... చుక్కల జింక అటవీ ప్రాంతం నుండి తాగునీటి కోసం గింజర్తి గ్రామంలోకి రాగా, ఇది గమనించిన వేటగాళ్లు దానిని మట్టు పెట్టారు. గ్రామ శివారున ఓ రైతుకు చెందిన పొలంలో దానిని తీసుకెళ్లి తల మొండెం వేరుగా చేసి వాటాలు వేసేందుకు సిద్ధపడగా, ఇది గమనించిన కొంతమంది గ్రామస్తులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో అటవీశాఖ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకోగా, వారు వస్తున్న సమాచారం తెలుసుకున్న వేటగాళ్లు అక్కడి నుంచి పరారయ్యారు. కాగా అప్పటికే చుక్కల జింక మొండెం, తల వేరుగా ఉన్నాయి. విషయాన్ని రాజవొమ్మంగి ఫారెస్ట్ రేంజ్ అధికారి అబ్బాయి దొరకు, ఫారెస్ట్ అధికారులకు సిబ్బంది సమాచారం ఇచ్చారు. వారి ఆదేశాల మేరకు రాజవొమ్మంగి పశువైద్యాధికారి తరుణ్ సంఘటన స్థలానికి చేరుకొని చుక్కల జింకకు శవ పంచనామా నిర్వహించారు, తల మొండెం వేరు చేయడం వల్లే జింక మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జింక మృతదేహాన్ని గ్రామస్తుల అటవీ సిబ్బంది సమక్షంలో దహనం చేశారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.



రక్తదానం చేస్తున్న పోలీసులు

పోలీసుల ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- రంపచోడవరం : స్థానిక పోలీసు డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో రంపచోడవరం ఏరియా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో బుధవారం మండల కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఐ సురేష్ కుమార్, ఎస్ఐ మోహన కుమార్, పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. కొంత మంది డిగ్రీ విద్యార్థులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహల్లి రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగుల కోసం రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ కౌన్సిలర్ వాసు, బ్లడ్ బ్యాంక్ బృందం, వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు, అంగన్వాడీ సిబ్బంది

'జన భాగీదారి'పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం దారకొండ అంగన్వాడీ సెక్టార్ పరిధి పి.గంగవరంలో జన భగీదారి కార్యక్రమంపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ కృష్ణకుమారి మాట్లాడుతూ ప్రాథమిక విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. ప్రాథమిక విద్య ద్వారా పిల్లల్లో మానసిక, శారీరక, సాంఘిక, భాషాభివృద్ధి, గణిత అభివృద్ధి, మేధా అభివృద్ధి పెంపొందించ వచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సత్యవతి, వార్డు మెంబర్ పాంగి పుల్లమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ లాలం సీతయ్య

గ్రామ సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కొయ్యూరు : గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఎంపీడీవో లాలం సీతయ్య సూచించారు. బుధవారం ఆయన బూదరాళ్ల గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వైయస్సార్ బీమా, ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా లక్ష్మి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- రంపచోడవరం : రంపచోడవరం ఏరియా ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.లక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు హాస్పిటల్ కౌన్సిలర్ వాసు అభినందనలు తెలిపారు. అనంతరం డాక్టర్ లక్ష్మి స్థానిక ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కె.సుందర్, ప్రేమకుమార్, తమ్మన్న కుమార్, హెడ్ నర్స్ కనక దుర్గ, ల్యాబ్ అసిస్టెంట్ భూషణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి

మైనర్లకు బైకులిస్తే చర్యలు!

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : డ్రైవింగ్ లైసెన్స్ లేని మైనర్లకు వాహనాలిచ్చిన వాహన యజమానులైన తల్లిదండ్రులకు నర్సీపట్నం టౌన్ పోలీసులు టౌన్ సిఐ నమ్మి గణేష్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టణంలోని మెయిన్‌రోడ్డులో నిబంధనలను విరుద్ధంగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపుతున్న 16 మంది మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు రప్పించి, నర్సీపట్నం టౌన్ సిఐ నమ్మి గణేష్ అధ్వర్యంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావతం అవ్వకుండా చూడాలని హెచ్చరించారు. పోలీసు తనిఖీల్లో వాహనాలను డ్రైవింగ్ చేస్తూ మైనర్లు పట్టుబడితే, ఈసారి సంబంధిత బైక్ యజమానిపై కేసు నమోదు చేయక తప్పదని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలు, దుష్పరిణామాలను వాహన యజమానులు, తల్లిదండ్రులకు వివరించారు.

ఎపిఇఎపి సెట్‌లో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -పాయకరావుపేట : ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎపిఇఎపి సెట్)లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి మంచి ర్యాంక్‌లు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ వి వి ఎస్‌బి భానుమూర్తి తెలిపారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో అగ్రికల్చర్ ఫార్మసీ విభాగంలో తమ కాలేజీ విద్యార్థులు యు.వెంకటేష్ 497వ ర్యాంక్, ఇంజనీరింగ్ విభాగంలో ఎన్. సూర్యచరణ్ 767వ ర్యాంక్, ఎస్.అశోక్ 1258 ర్యాంక్ సాధించారని తెలిపారు. 10వేలలోపు ర్యాకులు 23 మంది విద్యార్థులు సాధించి ప్రతిభ కనబరిచారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, తోటి విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.

వారాహి యాత్రకు తరలిన జనసైనికులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : జనసేనాని పవన్‌కల్యాణ్ బుధవారం అన్నవరంలో ప్రారంభించిన వారాహి యాత్రకు నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో జనసైనికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ వారాహి యాత్ర ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు, సంక్షేమం పేరుతో సంక్షోభం వైపు అడుగులేస్తున్న వైసిపి ప్రభుత్వ విధానాలను ప్రజలకు పవన్ కల్యాణ్ వివరిస్తారన్నారు. ఈ యాత్రను జనసైనికులందరూ ఐక్యతతో ముందుడి నడిపించాలన్నారు.కార్యక్రమంలో అద్దేపల్లి గణేష్, చిరంజీవి శ్రీను, రేగుబళ్ల శివ, బోయిన చిరంజీవి, వాసం వెంకటేష్, గండెం దొరబాబు, కొప్పాక కల్యాణ్, లంక పాత్రుడు, వాసం వెంకటేష్, కోనా నారాయణరావు. గూడెపు తాతబాబు, బంగారు నాయుడు, పరవాడ శ్రీను పాల్గొన్నారు.

ఉపాధి అమలుపై సమీక్ష

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలో ఉపాధి హామీ పథకం అమలుపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ సీతారామరాజు ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్క్ క్లోజర్స్ , జియో ట్యాగింగ్, అగ్రికల్చర్, హార్టికల్చర్ ఆన్‌లైన్ వర్క్ తదితర అంశాలపై చర్చించారు. లక్ష్యానికి అనుగుణంగా కూలీలకు పని కల్పించాలన్నారు .గ్రామాల్లో గుర్తించిన పనులను పక్కాగా నిర్వహించాలని సూచించారు.పని ప్రదేశంలో కూలీలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, వేసవిని దృష్టిలో పెట్టుకుని తప్పనిసరిగా తాగునీరు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ ఈశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఇసి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి రోజు కూలి రూ.600 చెల్లించాలి

ప్రజాశక్తి- నక్కపల్లి : ఉపాధి పథకానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి, కూలీలకు దినసరి వేతనం రూ.600 చెల్లించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బుచ్చిరాజుపేటలో ఉపాధి కూలీలతో మాట్లాడుతూ మండుతున్న ఎండల్లో ఉపాధి పని చేస్తున్న కూలీలకు శ్రమకు తగ్గట్టుగా కేంద్ర ప్రభుత్వం కూలీ చెల్లించడం లేదన్నారు. జాబ్ కార్డులో ఏడాదికి వంద రోజులు మాత్రమే పని కల్పిస్తే, మిగతా రోజుల్లో కూలీల కుటుంబాలు ఎలా బతికేదని ప్రశ్నించారు. జాబ్‌కార్డుకు ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.నానాజీ పాల్గొన్నారు

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-రోలుగుంట : అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. బుధవారం కె.నాయుడుపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొనేందుకు వచ్చిన ధర్మశ్రీకి గ్రామస్తులు స్వాగతం పలికారు.



యాదగిరీశ్వరరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు, ఉద్యోగులు

మండలాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా మండల అభివృద్ధికి కృషి చేస్తానని రాజవొమ్మంగి ఎంపీడీవోగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన లోకుల యాదగిరిశ్వరరావు తెలిపారు. ఎంపీడీవో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా యాదిగిరిశ్వరరావును పలువురు ప్రజాప్రతినిధులు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. సచివాలయ సిబ్బంది జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ.మల్లేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు కిషోర్, రామరాజు, రమేష్, సాయి ,ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మామపై కత్తితో అల్లుడు దాడి

ప్రజాశక్తి - కొయ్యూరు : పిల్లనిచ్చిన మామపై అల్లుడు కత్తితో దాడి చేసిన సంఘటన మండలంలోని కాకరపాడు వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.... కొయ్యూరు మండలం సోలాబు గ్రామానికి చెందిన పాంగి భాస్కరరావు తన కుమార్తె లక్ష్మిని చినగొంది గ్రామానికి చెందిన వంతల చిట్టిబాబుకు ఇచ్చి పెళ్లి చేశాడు. అల్లుడు చిట్టిబాబు సరిగా చూసుకోవడం లేదని, శారీరకంగా వేధిస్తున్నాడని తన కుమార్తెను తమ ఇంటికి తీసుకెళ్లిపోయాడు. దీంతో బుధవారం చిట్టిబాబు కాకరపాడు గ్రామంలో మామ భాస్కరరావుపై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన భాస్కరరావు ఫిర్యాదుతో చిట్టిబాబును పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై రాజారావు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

నేడు, రేపు ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్

ప్రజాశక్తి-మారేడుమిల్లి : రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని రంపచోడవరం, మారేడుమిల్లి, వై.రామవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, చింతూరు కేంద్రాల్లో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 15, 16 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ టి.అరుణ కుమారి, రంపచోడవరం ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ ఎంవి.రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకుని పాసైన విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ హాజరయ్యేవారు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు తీసుకొని రావాలని సూచించారు. పూర్తి వివరాల కొరకు 944119018, 8639193592 , 9959869424 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

హీరో మోటోకార్ప్ ఫ్యాషన్ ప్లస్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటోకార్ప్ తమ ప్యాషన్ ప్లస్ వాహనాన్ని బుధవారం ఉదయం రేసపువానిపాలెంలోని శ్రీ హర్ష మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయంలో ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశాఖపట్నం ది కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ చైర్మన్ సిహెచ్.రాఘవేంద్రరావు వాహనాన్ని ప్రారంభించి తొలి వాహనాన్ని కొనుగోలుదారుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లుగా ఆటో మొబైల్ ఫీల్డ్‌లో హర్ష మోటార్స్ విజయవంతంగా కొనసాగుతోందన్నారు. ఇక్కడ సామాన్యుడికి అందుబాటులో వాహనాలు విక్రయిస్తారన్నారు. హర్ష మోటార్ డీలర్ షిప్ ఎమ్‌డి సురేష్ మాట్లాడుతూ హీరో కంపెనీ ఫ్యాషన్ ప్లస్ బైకు మంచి ఆదరణ పొందిందని అన్నారు. దీని ఎక్స్ షోరూం ధర 75,751గా నిర్ణయించామని, బిఎస్-6 రెండో దశ నిబంధనకు లోబడి రూపొందించిన ఈ బైక్‌లో 100 సిసి ఇంజిన్ అమర్చామని తెలిపారు.

నీట్‌లో ఉత్తమ ఫలితాలు



నీట్ ఫలితాల్లో సత్తా చాటిన మారికవలస గిరిజన గురుకుల విద్యార్థులు

ప్రజాశక్తి-యంత్రాంగం

నీట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు తమ సత్తా చాటారు.

పిఎం.పాలెం, మధురవాడ : అల్లూరిసీతారామరాజు జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఎ పిఒ పర్యవేక్షణలో మారికవసలో నడుపుతున్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణా సంస్థలో శిక్షణ పొందిన విద్యార్థులు నీట్ -2023 ప్రవేశ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ పరీక్షకు ఈ పాఠశాల నుంచి 28 మంది విద్యార్థులు హాజరయ్యారని శిక్షణా సంస్థ ప్రిన్సిపల్ శివప్రసాద్ తెలిపారు. ఈ ఫలితాల్లో చింతపల్లి మండలం, ఈదులబయలు గ్రామానికి చెందిన పేద వ్యవసాయ కూలీ కె.సత్తిబాబు కె.మహేశ్వరి కుమారుడైన కె.ఇస్సా 420 మార్కులు సాధించి ఆలిండియా ఎస్‌టి కేటగిరీలో 3073వ ర్యాంకును సాధించాడని, గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు వచ్చే అవకాశాన్ని పొందాడని తెలిపారు. ఐదవ తరగతి వరకు ఎంపీపీ స్కూల్ చిన్నకొత్తూరు గ్రామంలోనూ, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు జిటిడబ్ల్యుఎ స్కూల్ డౌనూరు లోను, ఇంటర్, నీట్ శిక్షణను ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణా సంస్థ మారికవలసలో చదివినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి గిరిజన గురుకులాల్లో టాపర్‌గా నిలిచాడని ప్రిన్సిపల్ తెలిపారు.

చింతపల్లి మండలంలోని పాతకిన్నెర్ల గ్రామంలో ఆదిమ గిరిజన తెగకు చెందిన వ్యవసాయ కూలీ పి.బంగారాజు. పి.నీలమ్మల కుమారుడైన పి.మత్యరాజు 319 మార్కులు సాధించి ఆలిండియా ర్యాంకును ఎస్‌టి కేటగిరీలో 10,731వ ర్యాంకును కైవసం చేసుకుని గవర్నమెంట్ కళాశాలలో బిడిఎస్ కోర్సులో సీటు పొందే అవకాశం సంపాదించాడని వివరించారు. హుకుంపేట మండలం ఈదుల గరువు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ జి.ప్రసాదరావు, జి.లక్ష్మిల కుమారుడు జి.గోపాలరావు 283 మార్కులు సాధించి ఆలిండియా ఎస్‌టి కేటగిరీలో 14,651వ ర్యాంకు కైవసం చేసుకుని గవర్నమెంట్ కళాశాలలో బిడిఎస్ కోర్సులో సీటు పొందే అవకాశం సంపాదించాడని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ఎఎస్ఆర్ జిల్లా కలెక్టర్, ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ అభినందనలు తెలిపారు.

సత్తా చాటిన శశి విద్యార్థులు

భీమునిపట్నం : సంగివలసలోని శశి విద్యా సంస్థల విద్యార్థులు నీట్‌లో సత్తా చాటారు. ఈ మేరకు శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణు గోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బి.రవీంద్ర 720 మార్కులకు గాను 697 మార్కులతో ఒబిసి కేటగిరీలో ఆలిండియా 71వ ర్యాంక్, ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 351వ ర్యాంక్, పి.కృష్ణచైతన్య 695 మార్కులతో ఒబిసి కేటగిరీలో 114వ ర్యాంక్, ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 529వ ర్యాంక్, సిహెచ్.హర్షవర్ధన్ 695 మార్కులతో ఒబిసి కేటగిరీలో ఆలిండియా 384వ ర్యాంక్, ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 573వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. కె.హర్షిత 676 మార్కులతో ఒబిసి కేటగిరీలో ఆలిండియా 537వ ర్యాంక్, ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 1912వ ర్యాంక్, జె.తోయజాక్ష 676 మార్కులతో ఒబిసి కేటగిరీలో ఆలిండియా 1957వ ర్యాంక్ సాధించారని తెలిపారు. 690పైన మార్కులు ముగ్గురు, 675పైన 5 గురు, 600పైన 8 మంది, 500కి పైన 40 మంది ర్యాంకులు సాధించినట్లు వివరించారు. సుమారు 45కి పైగా విద్యార్థులు మెడిసిన్ సీట్లు సాధించారని తెలిపారు. అత్యుత్తమ ర్యాంక్ లు సాధించిన విద్యార్థులను శశి విద్యా సంస్థల కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధ అభినందనలు తెలిపారు.



శశి విద్యార్థి తోయజాక్ష

పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన జామి తోయజాక్షకు నీట్-2023లో ఓపెన్ కెటగిరిలో ఆల్ ఇండియా 1957వ ర్యాంక్, ఆల్ ఇండియా ఓబిసిలో 559 ర్యాంకు సాధించాడు. తగరపువలస సమీపంలోని సంగివలస శశి కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి నీట్ పరీక్ష రాశాడు.

వరాహ పుష్కరణిలో చేపలు మృతి

మూడు రోజులైనా పట్టించుకోని అధికారులు

దుర్వాసనతో భక్తులు, స్థానికుల అవస్థలు



వరహా పుష్కరణిలో మృతిచెందిన చేపలు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానానికి పవిత్రమైన వరాహ పుష్కరణిలో నిత్యం కలకలలాడే చేపలు కొద్దిరోజులుగా మండుతున్న ఎండలకు మృతిచెందుతున్నాయి. శనివారం చాలా చేపలు చనిపోయాయి. చెరువు కిరువైపులా ఒడ్డుకు వచ్చి పడిఉన్నాయి. ఐదు రోజులు కావస్తున్నా దేవస్థానం అధికారులు చెరువులో చనిపోయిన చేపలను తొలగించకపోవడంతో దుర్వాసన ప్రారంభమైంది. మంగళవారం అమ్మవారి పండక్కి వచ్చిన బంధువులు, స్థానికులు ఈ దుర్వాసనతో తీవ్ర అవస్థలు పడ్డారు. స్వామి వారి దర్శనానికి వచ్చే గ్రామీణ ప్రాంత భక్తులు పుష్కరణిలో స్నానమాచరించి కొండపైకి వెళ్తుంటారు. ఈ దుర్వాసన భరించలేక పుష్కరణిలో స్నానం చేయకుండానే ముక్కులు మూసుకుంటూ ఈ చెరువులోని నీరు చల్లుకొని స్వామి దర్శనానికి వెళ్లడం కనిపిస్తోంది. దేవస్థానం అధికారులు వెంటనే స్పందించి చెరువులో చనిపోయిన చేపలను వెంటనే తొలగించి దుర్వాసన లేకుండా చేయాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

'ఉక్కు'పై నేటికీ కేంద్రం క్రూరత్వం

విలువైన ఆస్తులను తెగనమ్మే కుతంత్రం - సుదీర్ఘకాలంగా పోరాడుతున్న కార్మికులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

తెలుగు రాష్ట్రాలకు తలమానికంగా నిలిచే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రంలోని కాషాయ ప్రభుత్వం తన క్రూరత్వాన్ని కొనసాగిస్తూనే ఉంది. 'ఉన్న ఆస్తులమ్మేసి బతకండి, ఆస్తులారిపోతే ఇంటికి పొండి, ఉక్కు ఫ్యాక్టరీని మేం అమ్మేస్తాం' అన్న విధానాన్ని కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా ఏకమై స్టీల్‌ప్లాంట్ రక్షణకు నిలబడుతున్నా నీరుగార్చే యత్నాల్లోనే కాషాయ సర్కారు ఉంది. ఇప్పటికే ఉత్తరప్రదేశ్‌లోగల వీల్ ప్లాంట్‌ను అమ్మేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. తాజాగా విశాఖపట్నంలోని స్టీల్ ఆస్తుల వేలానికి కేంద్రం ముందుకడుగులేసింది. 853 రోజుల నుంచి విశాఖ కార్మికులు, ప్రజా సంఘాల నేతలు ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయడానికి వీల్లేదంటూ వివిధ రూపాల్లో పోరాడుతున్నా ఏ మాత్రమూ పట్టించుకోకుండా దుందుడుకుగా ముందుకెళ్తోంది. విశాఖలో తొమ్మిదేళ్ల బిజెపి పాలనా విజయాలపై బహిరంగ సభలో పాల్గొనేందుకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వచ్చిన రోజునే విశాఖలోగల విలువైన స్టీల్‌ప్లాంట్ ఆస్తుల అమ్మకానికి యాజమాన్యంతో జిఒ జారీ చేయించడం కేంద్ర అరాచక పాలనకు అద్దం పడుతోందంటూ మేధావులు సైతం విమర్శలు గుప్పిస్తున్నా ప్రధాని నరేంద్ర మోడీ తన దూకుడును తగ్గించకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. అమిత్ షా విశాఖ సభలో పాల్గొని స్టీల్‌ప్లాంట్ విషయాన్ని కనీసం ప్రస్తావించకుండా ఢిల్లీకి వెళ్లిపోవడం చూస్తే కార్మికుల పట్ల నిర్లక్ష్యం ఎంతో అర్థమవుతోంది.

రూ.5 వేల కోట్ల కోసం రూ.3 లక్షల కోట్ల ఆస్తిపై వేటా ?

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సజావుగా నడిచేందుకు అవసరమైన రా మెటీరియల్ (ఐరన్ ఓర్, కొకింగ్ కోల్)కు రూ.5 వేల కోట్లును బ్యాంకుల నుంచి కేంద్రం హామీ ఇచ్చి ఆదుకుంటే ఉత్పత్తి గణనీయంగా ముందుకు సాగిపోయేది. కానీ స్టీల్‌ప్లాంట్‌ను విశాఖలో లేకుండా చేసే కుట్రపూరిత వ్యూహంలో భాగంగా నరేంద్రమోడీ ప్లాంట్ మొత్తం విలువ రూ.3 లక్షల కోట్లను తెగనమ్మేసే పథకంతో అడ్డగోలుగా ముందుకెళ్తున్నాడు. దీంట్లో భాగంగా ఈ నెల 10న విశాఖ నగరంలోని హెచ్‌బి (హౌసింగ్ బోర్డు) కాలనీలోగల 22 ఎకరాలు, ఆటోనగర్‌లోగల క్వార్టర్స్ స్థలం రెండు ఎకరాలు (4 ల్యాండ్ పార్సిల్స్), పెదగంట్యాడలోగల ఒక ల్యాండ్ పార్సిల్ (434.75 చదరపు అడుగుల పాత హెల్త్ సెంటర్ స్థలం)ను అమ్మకానికి పెడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. దీంతో కార్మికవర్గం మరింత భగ్గుమంది. రెండేళ్లకుపైగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేక ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా ప్రజలు, కార్మికవర్గం, మేధావులు పాల్గొంటూ మద్దతు పలుకుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒక రాష్ట్ర ప్రయోజనాలన్నిటినీ దెబ్బతీస్తూ కేంద్రం మొండితనంతో వ్యవహరించడంపై తీవ్రస్థాయిలో విశాఖ ఉక్కుపరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన పోరాడుతున్న కార్మికులంతా మండిపడుతున్నారు.

ప్రభుత్వ రంగంలో కొనసాగే వరకూ పోరాటం

: ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, మనుగడను దెబ్బతీసే కేంద్రంలోని బిజెపి సర్కారుపై పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్‌లు సిహెచ్.నరసింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కన్వీనర్ కెఎఎస్ఎన్.రావు, కో - కన్వీనర్లు జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు సంయుక్త ప్రకటనలో స్పష్టం చేశారు.

రియల్ మి 11 ప్రో సిరీస్ 5జి ఫోన్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : టెక్నాలజీ బ్రాండ్ స్మార్ట్‌ఫోన్ సర్వీస్ ప్రొవైడర్ రియల్ మి ఫ్లాగ్ షిప్ నెంబర్ సిరీస్‌కి సరికొత్త జోడింపుగా తన 11 ప్రో సిరీస్ 5జిని ప్రకటించినట్లు సంస్థ ప్రొడక్ట్ మేనేజర్ శ్రీహరి తెలిపారు. బుధవారం ఉదయం బీచ్ రోడ్‌లోని పార్క్ హోటల్‌లో రియల్ మి 11 ప్రో, రియల్ మి 11 ప్రో ప్లస్ ఫోన్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వినియోగదారులకు మరింత సాంకేతికతను అందించాలనే నిబద్ధతతో అత్యాధునిక ఫీచర్లు, అసాధారణమైన పనితీరు, మంచి డిజైన్లతో నిరంతర ఆవిష్కరణలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. రియల్ మి 11 ప్రో, ప్రో ప్లస్ ఫోన్‌లలో శక్తివంతమైన కెమెరా సిస్టం, అధిక రిఫ్రెష్ రేట్ డిస్‌ప్లే, ఆకట్టుకునే పనితీరు, ప్రీమియం డిజైన్, అధునాతన ఛార్జింగ్ సౌకర్యాలు ఉన్నాయన్నారు. రియల్ మి 11 ప్రో ప్రారంభ ధర రూ.23,999, రియల్ మి 11 ప్రో ప్లస్ ప్రారంభ ధర రూ.27999గా ఉందని అన్నారు. వీటి అమ్మకాలు గురువారం నుంచి రియల్ మీ వెబ్‌సైట్, ఫ్లిప్‌కార్ట్‌లతో పాటు తమ స్టోర్స్‌లో లభిస్తాయని ఆయన తెలిపారు.

అరకు కాఫీ విక్రయశాల ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హైదరాబాద్ నగరంలో బుధవారం రాయదుర్గం మెట్రో స్టేషన్ పరిధిలో 'హట్ అరెబికా' (జిసిసి అరకువేలీ కాఫీ) విక్రయశాలను ఆంధ్రప్రదేశ్ గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి, సంస్థ ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్ ప్రారంభించారు. ఇతర ప్రధాన కూడళ్లలో అతి త్వరలో ఇలాంటి వాటిని పెట్టేందుకు కృషి చేస్తామన్నారు. ఈ విక్రయశాలలో కాఫీతో పాటుగా గిరిజన సహకార సంస్థ గిరిజనుల నుంచి సేకరించిన తేనె, పసుపు, చింతపండు, కుంకుడుకాయలు, సీకాకాయ, ఉసిరి, కొండచీపుర్లు మొదలగు అటవీ ఫల సాయాల నుంచి తయారుచేసిన ఉత్పత్తులను కూడా నగర ప్రజలకు అందుబాటులో తీసుకువస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బుల్లితెర ప్రముఖులు పాల్గొన్నారు.



అరకుకాఫీ విక్రయశాల ప్రారంభంలో స్వాతిరాణి తదితరులు

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని వెదుళ్లపాలెంలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శిరీష తెలిపిన వివరాల ప్రకారం వెదుళ్లపాలెం గ్రామానికి చెందిన ఓరుగంటి దుర్గా శ్రావణి(21)కి పెనుగొల్లుకు చెందిన నాగ శివతో వివాహం అయ్యింది.వీరికి పాప ఉంది. ఈమె ప్రస్తుతం రెండు నెలల గర్భిణి. వెదుళ్లపాలెంలో పుట్టింట ఉంటోంది. మంగళవారం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇటీవలా కడుపునొప్పితో బాధపడుతుందని మృతురాలు తల్లి పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శిరీష వెల్లడించారు.

క్రికెట్ బ్యాట్‌తో దాడి : ఒకరు మృతి

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని పెదతీనార్ల గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన తగాదాలో ఒకరు మృతి చెందినట్లు సిఐ నారాయణరావు బుధవారం వెల్లడించారు. సిఐ చెప్పిన సమాచారం మేరకుపెదతీనార్ల గ్రామానికి చెందిన కారే రమణ (40) మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. పొరుగున ఉన్న సమీప బంధువు మెరుగు లోవరాజు వచ్చి వారించబోగా, ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అప్పటికే ఇరువురి మధ్య వ్యక్తిగత పాత గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో లోవరాజు కోపంతో క్రికెట్ బ్యాట్‌తో రమణ తలపై కొట్టగా, తీవ్రంగా గాయపడిన రమణను స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం, మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించారు. కెజిహెచ్‌లో వైద్యం పొందుతూ ఆరోగ్యం విషమించడంతో బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు మృతుడు రమణ ు భార్య కాసులమ్మ ఫిర్యాదు చేసినట్లు సిఐ వెల్లడించారు.ఈ మేరకు హత్య కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు .

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చోడవరం : మండలంలో గజపతినగరం వద్ద ఈనెల 3వ తేదీ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బుధవారం మృతి చెందారు. చోడవరం సిఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం.... మండలంలోని అంబేరుపురం గ్రామానికి చెందిన తనకళ నాయుడు (37) లారెన్స్ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 3న తేదీ రాత్రి నాయుడు గోవాడ వద్ద లారెన్స్ బస్సు దిగి గజపతినగరం వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన పల్సర్ బైక్ ఆయన్ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాయుడును అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తూ వచ్చారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బుధవారం బుధవారం తెల్లవారుజామున విశాఖకు తరలిస్తుండగా నాయుడు మృతి చెందాడు. స్థానిక ఎస్సై అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రమబద్ధీకరణపై కాంట్రాక్టు లెక్చరర్ల హర్షం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు లెక్చరర్ల ఉద్యోగాలను సిఎం జగన్ క్రమబద్ధీకరించారని ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బిఎస్ఆర్ శర్మ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గల రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి అసోసియేషన్ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ, 2000 సంవత్సరం నుంచి కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని విన్నవించినా, ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ఈ మేరకు సిఎంజగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వైఎల్‌వి రాజేష్, సభ్యులు కెసిహెచ్ మణి, బి రాజేశ్వరరావు, బి లక్ష్మణరావు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం పట్టణంలో 100 అడుగుల రోడ్డు విస్తరణ పనులపై ఆర్‌డిఒ హెచ్‌వి జయరాం అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బుధవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి మున్సిపల్, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, రోడ్లు భవనాల శాఖ, ఆర్‌టిసి, పోలీసు శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణకు చేపట్టాల్సిన చర్యలపై ఎమ్మెల్యే గణేష్ వారితో సుదీర్ఘంగా చర్చించారు.

విద్యుదాఘాతంతో నాలుగు పశువులు మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

విద్యుత్ షాక్‌కు గురై నాలుగు పశువులు మృత్యువాత పడిన సంఘటన మండలంలోని సింగంపల్లి గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం.... గ్రామ శివారులో ఇటీవల వేసిన ఈదురు గాలులకు విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయి. అటుగా మేతకు వెళ్లిన ఆ గ్రామానికి చెందిన ఎల్లం సత్యనారాయణ, మరో రైతుకు చెందిన నాలుగు పశువులకు ఆ విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై అవి మృతి చెందాయి. ఇది గమనించిన రైతులు అధికారులకు సమాచారం ఇవ్వగా పశువైద్యాధికారి తరుణ్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా విద్యుత్ షాక్ గురై పశువులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. వ్యవసాయ పనులకు చేదోడుగా ఉండే పశువులు మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు గగ్గోలు పెడుతున్నారు.



క్షతగాత్రున్ని పరామర్శిస్తున్న నాయకులు

ఆటో బోల్తా పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - కొయ్యూరు : చింతపల్లి మండలం, ఎర్రబొమ్మల పంచాయితీ, తెప్పల మామిడి సమీపంలో మంగళవారం సాయంత్రం ఆటో అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో కొయ్యూరు మండలం గోకిరి గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు శాతా విశాల్ తేజ మృతి చెందాడు. పలువురు గాయపడ్డారు. వీరంతా మత ప్రచారానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులు కుడుముల వెంకటలక్ష్మి, రాటా రాజుబాబు, కుడుముల పాపయమ్మ నర్సీపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలోనూ, కుడుముల కుమారి, కసిపల్లి అనూష, కసిపల్లి నూకరత్నం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలోనూ చికిత్స పొందుతున్నారు.

మెరుగైన వైద్యానికి ఐటిడిఎ పిఒకు విజ్ఞప్తి

ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి, రామకృష్ణ దంపతులు, కొండగోకిరి సర్పంచ్ రేగటి ముసలి నాయుడు, వైసీపీ నాయకుడు రామరాజు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం పాడేరు ఐటీడీఏ పీఓ అభిషేక్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించి, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటువంటి పరిస్థితుల్లో గిరిజనులకు మెరుగైన వైద్యం అందించేలా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ఎస్టీ సెల్ ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనికి పీఓ అభిషేక్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

బైకు బోల్తా పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని జీడిగుప్ప క్రాస్ రోడ్డు మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి బోల్తా పడిన సంఘటనలో బుధవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన కోట్ల వరదరాజులు (40) బుధవారం మధ్యాహ్నం తన బైక్‌పై అతివేగంగా వస్తూ కంట్రోల్ తప్పి జీడిగుప్ప క్రాస్ రోడ్డు మూలమలుపు వద్ద బోల్తా పడ్డాడు. వరదరాజులు కొన ఊపిరితో ఉండగా, కొందరు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి వరదరాజులును హుటాహుటిన కోతులగుట్ట ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడి పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16వ వార్డు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 16వ వార్డు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని, ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. బుధవారం ఆమె మూడో జోన్ 16వ వార్డు పరిధిలోని పలుచోట్ల పర్యటించారు.